# బస్సు యాత్రకు భయపడే రైతుబంధు ఇచ్చారు

- ప్రజల గుండెల్లో కేసీఆర్ పథకాలు
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట, మే 8 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు భయపడే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు బంధు నిధులను విడుదల చేసిందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని వాటిని తొలగించడం అంత సులభం కాదని ఆయన అన్నారు. బుధవారం బొంరాస్‌పేట మండలం తుంకిమెట్లలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు ఇష్టం లేని పార్టీ కాంగ్రెస్ అని ఆ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అన్న కాంగ్రెస్‌లోకి పోయిండు తమ్ముడు కూడా నేడో రేపో పార్టీ మారుతున్నాడని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, తాను ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌ను వీడేది లేదని తేల్చి చెప్పారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని, తమపార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో మంచి పథకాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంటు పోయిందని, ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు ఉన్నాయి కాబట్టి విద్యుత్ సరఫరా చేస్తున్నారని, ఎన్నికలు ముగిసిన తరువాత విద్యుత్ సమస్య ఏర్పడడంతో పాటు రైతుబంధులో కొర్రీలు పెడ్తారని అన్నారు. దుద్యాల మండలంలోని మూడు గ్రామాలకు చెందిన రైతులు ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా సీఎంకు వివరించడానికి వస్తే రైతులను అరెస్టు చేశారని, సీఎం స్వంత నియోజకవర్గంలో రైతులకు ఇలాంటి పరిస్థితి రావడం దురదృష్టకరమని అన్నారు. కొడంగల్ నియోజకవర్గం లో కార్యకర్తలు కష్టపడి ప్రచారం చేసి మన్నె శ్రీనివాస్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోట్ల యాదగిరి, తాలూకా, మండల యూత్ అధ్యక్షులు నరేశ్‌గౌడ్, మహేం దర్, మాజీ వైస్ ఎంపీపీలు నారాయణ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, అబ్దుల్ వాహబ్, సలాం, రవిగౌడ్, ఎంపీటీసీలు తిరుపతయ్య, జగదీష్,నర్సింహులునాయక్, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు హాజరయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## హామీలు నెరవేర్చకుండా ఓట్లు ఎలా అడుగుతారు

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్


గంగారంలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ మే 8 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధి లోని గంగారంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను ఓట్లు ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి మరిచారన్నారు. నాలుగువేల రూపాయల పింఛన్ అందిస్తామని మోసం చేశారన్నారు . రూ. 500 కి గ్యాస్ మాటే ఎత్తడం లేదన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ ను భారీ మెజార్టీతో గెలిపించి కేసిఆర్ కు కానుకగా ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కౌన్సిలర్లు అనంత్ రెడ్డి, గోపాల్, రాములు, రామస్వామి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మేక చంద్ర శేఖర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, నాయకులు రమణ, నర్సింహులు, లక్ష్మణ్, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, ఫరీద్, మల్లేశం, విజయ్ కుమార్, కిశోర్, ముర్తుజా అలీ, కిట్టు, సోషల్ మీడియా మల్లేశ్, యూత్ అధ్యక్షులు గిరీష్ కొఠారి, షఫీ, అనిల్ ప్రవీణ్,జైపాల్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌వి బూటకపు హామీలే

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, మే 8: కాంగ్రెస్ పార్టీ హామీలన్నీ బూటకమని తేలిందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విమర్శించారు. అమలు సాధ్యం కాని హామీలిచ్చి, వాటి అమలుకు గడువులు పెంచుతూ పోతున్నదని పేర్కొన్నారు. బుధవారం చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట, బాబాపూర్, సాలిప్పల బాటతండాల్లో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలపుడు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని తుంగలో తొక్కడం కాంగ్రెస్ నైజమని దుయ్యబట్టారు. కేసీఆర్ నాయకత్వంలోని పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరిందన్నారు. పైరవీలకు, లంచాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరాయని ఆయన గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీ అమలుపై మాట మీద నిలబడలేదని, అన్ని బూటకపు మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నదన్నారు. తమకు అన్ని మంచి చేసిన కేసీఆర్‌ను దూరం చేసుకొని తప్పు చేశామని ప్రజలు భావిస్తున్నారన్నారు. అయిదు నెలల్లోనే ప్రజలకు కాంగ్రెస్ మోసపు నైజం అర్థమైందని, పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికీ తిరిగి కాసాని విజయం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి, బీఆర్ఎస్‌కు జై కొడుతున్న ప్రజలు

## దొంగ పార్టీల హామీలను నమ్మొద్దు

- కపట కాంగ్రెస్, మోసం చేసే బీజేపీని తరిమికొట్టండి
- రైతు రుణమాఫీ కాకుంటే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రాజీనామాకు సిద్ధమా..?
- బీఆర్ఎస్ అభ్యర్థి కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, మే 8: ఎన్నికల వేళ దొంగ పార్టీలు ఇచ్చే హామీలను ప్రజలు నమ్మరాదని తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం తాండూరు పట్టణంలో బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని వార్డుల్లో రోడ్ షో నిర్వహిస్తూ.. విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసే బీజేపీని, అమలు కాని హామీలను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టాలన్నారు. 60 ఏండ్లలో చేయని రాష్ట్ర అభివృద్ధిని తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ చేసి చూపించారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో తాండూరు నియోజకవర్గంలో రూ.1672.49 కోట్లతో అభివృద్ధి, రూ.1648.12 కోట్లతో ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను నిండా ముంచిందన్నారు. రైతులను గోస పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరచిపోయి కూడా కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయరాదని సూచించారు. ప్రజల కోసం నిత్యం పరితపించే బీఆర్ఎస్‌కు ప్రజలు ఓటేసి బీసీల ముద్దు బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కట్టాలన్నారు. ఆగస్టు 15న రైతు రుణమాఫీ చేయకపోతే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రాజీనామాకు సిద్ధమా..? అని సవాల్ విసిరారు. తాండూరుకు తీసుకొచ్చిన అభివృద్ధికి అడ్డుకట్టలు వేశారని విమర్శించారు. తాండూరు బిడ్డగా ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు నరేందర్‌గౌడ్, రాఘవేందర్, సంగీతాఠాకూర్, శ్రీనివాస్‌చారి, నయీం తదితరులున్నారు.

## బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి


పార్టీలో చేరిన నాయకులతో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, మే 8 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు.బుధవారం మండలానికి చెందిన పలువురు నాయకులు తాండూరు ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి సామాన్యులపై భారం పడిందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మత విద్వేషాలు నిత్యకృత్యమవుతాయన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల జడ్పీటీసీ ధారాసింగ్, పెద్దేముల్ సొసైటీ డైరెక్టర్ ఎస్.నారాయణరెడ్డి, యువనాయకులు పి.మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ లొంక నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## పదేండ్లలో బీజేపీ చేసిందేమీ లేదు


సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, మే 8 : గత పదేండ్లలో బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని అంగడి చిట్టంపల్లి, మన్నెగూడ, సోమన్‌గుర్తి గ్రామాల్లో పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న ప్రధాన మంత్రి మోదీ తెలంగాణకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. బీజేపీకి ఓటు వేస్తే దేశం మరో ఐదేండ్లు అభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.ఆనందం, సొసైటీ చైర్మన్ సతీశ్‌రెడ్డి, మాజీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శకిల్, పెంటయ్య, శ్రీనివాస్, సుబాన్‌రెడ్డి, అజీంపటేల్, శ్రీనివాస్ గుప్తా, నర్సింహారెడ్డి, అనంత్‌రెడ్డి, మధు, ముక్కంటి, వెంకటేశంగుప్తా, బాలమణి, శ్రీశైలం గౌడ్, బి.రవి, చెన్నయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఊరూరా బీఆర్ఎస్ ప్రచారం


మల్లెమోనిగూడలో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, మే 8: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి సహకరించాలని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కోరారు. బుధవారం పరిగి మున్సిపల్ ఒకటవ వార్డు మల్లెమోనిగూడలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరిగిందని, అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా మరోసారి అభివృద్ధికి సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మౌలానా, అశోక్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ధారూరు :** మండల పరిధిలోని తరిగోపుల, ధారూరు, దోర్నాల్, హరిదాస్‌పల్లి, ఎబ్బనూరు, నాగుసాన్‌పల్లి, మైలారం తదితర గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అబద్ధపు హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాం గ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ప్రజల పక్షాన ఉండే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాసాని గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని కోరారు. ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డిపై నమ్మకం పోయిందని, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కావలి అంజయ్య, రాజుగుప్తా, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, వెంకటయ్య, వెంకట్రాం రెడ్డి, బాబయ్య, అంజయ్య, రాఘవేందర్, రాములు, యాదయ్య, రవికుమార్, రామయ్య, శ్రీశైలం, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**యాలాల :** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలో బీఆర్ఎస్ ప్రచారం ఊపందుకున్నది. బుధవారం సంగెంకుర్దు గ్రామంలో తాండూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ వైస్ ఎంపీపీ అనంతయ్య ముదిరాజ్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేశారు. గ్రామ చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గత పదేండ్లలో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న మోసాలను గుర్తించాలన్నారు.

**పెద్దేముల్ :** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముమ్మరంగా చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు గౌడ్, మామిళ్ల వెంకట్, పిల్లి వెంకట్, శ్రీనివాస్, బుద్దారంలో తలారి శ్రీనివాస్, కందనెల్లి తండాలో సాగర్, తింసాన్‌పల్లిలో పగిడ్యాల మాధవ రెడ్డి, గోపాల్‌పూర్‌లో ఈడ్గి శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాములు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దోమ మండలం రాకొండ తండాలో..

**దోమ :** బహుజన నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల గడ్డపై గెలిపించాలని ఎంపీటీసీ నవాజ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని దిర్సంపల్లిలో నవాజ్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఈవీఎం ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాకొండ గ్రామ పంచాయతీ అనుబంధ తండాలో స్థానిక బీఆర్ఎస్ యువ నాయకుడు చాపల వెంకటయ్య కార్యకర్తతో కలిసి ప్రచారం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని మహిళలకు, యువకులను కోరారు. అయినాపూర్‌లో ఎంపీటీసీ విజయాఆంజనేయులు, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రుక్మయ్య కార్యకర్తలతో కలిసి ఉపాధి కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రామ్ నాథ్, బైడ్ల బాలయ్య, జహంగీర్, రాములు, రమేశ్, యువనాయకుడు కొండా రెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పెద్దేముల్ మండల కేంద్రంలో ..

**పూడూరు :** చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమని పరిగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారొద్దీన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎ.వెంకటయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని దేవనోనిగూడెం, సిరిగాయపల్లి, పూడూరు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ఉన్న రాష్ట్రానికి ఏ ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తామన్న పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. జరిగే ఎన్నికల్లో అందరూ బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించేందుకు కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో యు.బుచ్చన్న, ఎల్ సత్యనారాయణ, పార్టీ జిల్లా నాయకుడు రాంగోపాల్ యాదవ్, సీతారాంరెడ్డి, సతీశ్‌పంతులు, మధసూదన్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహాచారి, పి.శేఖర్ ఎస్.నర్సింహులు, ఎ.శ్రీనివాస్, ఎ.చెన్నయ్య, ఎస్.కృష్ణ, సీతారాములు గ్రామ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంధ విద్యార్థి అవసరాలు తీర్చాలని ఆదేశాలు

వికారాబాద్, మే 8 : బషీరాబాద్ మండలం కొరవిచెడ గ్రామానికి చెందిన అభిషేక్ పుట్టుకతోనే చూపుకోల్పోయాడు. ప్రస్తుతం ఢిల్లీ జాతీయ న్యాయ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. కొరవిచెడలో సొంత నివాసం దగ్గర మరుగుదొడ్డి లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఊరికి దూరంగా వెళ్లవలసి వస్తున్నదని, ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన అధికారులు వికారాబాద్ జిల్లా న్యాయసేవా అధికార సంస్థకు సమాచారం అందించారని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ సున్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే జిల్లా కలెక్టర్‌కు రిఫర్ చేసి, సొంత గ్రామంలో స్వచ్ఛ భారత్ పథకం కింద మరుగుదొడ్డి నిర్మించాలని ఆదేశించారు.

## పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

- వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, మే 8 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని మేరీ ఏ నాట్ పాఠశాలలో అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ఫెసిలిటేషన్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సౌకర్యాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, నీటి సౌకర్యం, వీల్ చైర్లు, నిరంతర విద్యుత్, ఫ్యాన్లు ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 10 పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

## బంజారాలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలు

పెద్దేముల్, మే 8: కాంగ్రెస్, బీజేపీలు గత 75 ఏండ్లుగా బంజారాలను మోసం చేస్తూనే ఉన్నాయని యాడీబాపుగడ్ దేవస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రం, జగో బంజారా సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామావత్ సురేందర్ నాయక్ మహరాజ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని యాడీబాపుగడ్‌లో తండా తండాకు జాగో బంజారా సమాజ్ రాజకీయ చైతన్య ప్రచార కార్యక్రమం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో బంజారాల మేలుకో పార్టీలు, నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కాంగ్రెస్ బీజేపీల నేతలు బంజారాలకు స్వాతంత్ర ఫలాలు, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు అందకుండా చేశారన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఆ పార్టీల నాయకులు పని చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాడీబాపుగడ్ ఆలయ ధర్మ కర్త రమావత్ శాంతీబాయి, రమేశ్, ఆకాశ్, కుమార్, సుశీల, కరిష్మా, కవిత తదితరులు పాల్గొన్నారు

## బిల్డింగ్ స్లాబ్ మీదపడి వ్యక్తి మృతి



తాండూరు/ బొంరాస్‌పేట మే 8: బిల్డింగ్ స్లాబ్ మీదపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం తాం డూరు పట్టణంలో చోటు చేసుకున్నది. బొంరాస్‌పేట్ మండలం జానకం పల్లికి చెందిన వెంకటయ్య (42) తాండూరు పట్టణం లారీ పార్కింగ్ సమీపంలో నిర్మిస్తున్న బిల్డింగ్‌లో కూలి పనికి వచ్చాడు. పని చేస్తున్న సమయంలో నాణ్యత లేకుండా నిర్మించిన స్లాబ్ ఒక్కసారిగా కూలి వెంకటయ్యపై పడింది. గమనించిన తోటి కూలీలు లబోదిబోమనడంతో భవన నిర్మాణ దారులతో పాటు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. జేసీబీ సహాయంతో కూలిన స్లాబ్‌ను తీశారు. తీవ్ర గాయాలైన వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీ సులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. కూలిన భవనం నిర్మించేందుకు ఎలాంటి అనుమతులు కూడా లేనట్లు సమాచారం. వెంకటయ్య మృతిచెందడంతో జానకం పల్లిలో విషాదం నెలకొంది. వీరికి కూతురు అంకిత, కొడుకు గణేష్ ఉన్నాడు. కూతురు అంకిత వివాహం గత నెలలోనే జరిపించాడు.

### 10 వరకు పోస్టల్ బ్యాలెట్ పొడిగింపు: కలెక్టర్

వికారాబాద్, మే 8 : పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు మే 10 వరకు గడువును పొడిగించినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు ప్రక్రియ కొనసాగుతు న్నదని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు మే 10 పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ సదవకాశాన్ని పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కలెక్టర్ సూచించారు.

## గాలివాన బీభత్సం

-విరిగిన చెట్లు, తెగిపడ్డ విద్యుత్ వైర్లు -కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

బొంరాస్‌పేట, మే 8 : మండలంలోని బొంరాస్‌పేట, మెట్లకుంట తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించాయి. సుమారు అరగంటపాటు బలమైన ఈదురు గాలులతో పాటు చిన్నపాటి జల్లులు కురిశాయి. ఈదురు గాలులకు పలు చోట్ల చెట్లు విరిగి పడగా, విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. రాత్రి ఏడు గంటల నుంచి రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బొంరాస్‌పేట, మెట్లకుంట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా కప్పిన ప్లాస్టిక్ కవర్లు గాలికి కొట్టుకుపోవడంతో వర్షానికి ధాన్యం తడిసి పోయింది. ధాన్యం తడవకుండా రైతులు నానా అవస్థలు పడ్డారు.

**కులకచర్ల మండలంలో..**

కులకచర్ల, మే 8: మండల పరిధిలో బుధవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం గంటపాటు ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో ఉన్న మామిడితోటలలో మామిడి కాయలు నేలరాలాయి. ఆయా గ్రామాల్లో చెట్లు విరిగిపోయాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. బుధవారం కురిసిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం తడువడంతో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కులకచర్ల పీఏసీఎస్ సీఈవో బక్కారెడ్డి పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The Notice is hereby given to General Public that our client is intending to purchase All that the Plot No. 72, (Block-C, old Plot No. 8/7) in layout of Survey No.135 admeasuring 472 Sq Yards situated at **"Brundavan Colony"** Narsinghi Village & gram Panchayat, Gandhipet Mandal, Ranga Reddy District-State of Telangana. bounded by: North: Plot No. 70 (Block-C old Plot No. 8/6, South:30 Feet Road, East: Plot No. 73 (Block-C old Plot No. 8/14, West: 40 feet Road. Any person having or claiming any right, interest, claim, demand or benefit whatso ever in respect of the Schedule Property by way of sale, exchange, mortgage, gift, trust, development rights, inheritance, bequest, possession, lease, license, tenancy, lispendens, lien, charge, maintenance, easement or under any Agreement or Power of Attorney whatsoever or otherwise howsoever, is hereby required to notify the same in writing with documentary proof thereof to the undersigned at the address as mentioned below, within Seven (7) days from the date hereof, failing which it shall be construed that either there is no claim, demand, right or interests whatsoever in or over the Schedule Property adverse to the aforesaid owner or the same has been waived for all intents and purposes and sale shall be completed.

**Sd/- PRAVEEN KUMAR JAIN** B.A, LL.M
Advocate
H.No: 14-1-18, Near Police Station,
Mangalhat, Hyderabad-500006.
Cell: 9851609064